క్లుప్తంగా

వైద్యశిబిరం

ఖానాపూర్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో ఉన్న ఇంద్రానగర్‌లో వైద్యశిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో పరిమి సురేశ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ గణేశ్ మండలి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కరిపె శ్రీనివాస్, అధ్యక్షుడిగా వేల్పుల రమేశ్, కోశాధికారిగా పెరుమాండ్ల హరీశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ధాత్రిక రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఆకుల శ్రీనివాస్, ద్యావత్ రాజేశ్వర్, దాసరి రాజన్న, గుగ్గిళ్ల రాజేందర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

మరమ్మతులు

భైంసాటౌన్: వినాయక నవరాత్రోత్సవాల వేళ పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర మార్గంలో విద్యుత్ అధికారులు మంగళవారం లైన్ మరమ్మతులు చేపట్టారు. ఇటీవల మున్సిపల్ సమావేశంలో, గణేశ్ ఉత్సవాలపై నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ శోభాయాత్ర మార్గంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పురాణబజార్, గణేశ్‌నగర్‌లో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఏడీఈ ఆదిత్య, సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన శనిగారపు అనసూయకు రూ.22,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో లబ్ధిదారుకు చెక్కు అందజేశారు. సాయన్న తదితరులున్నారు.

రూ.50వేల విరాళం అందజేత



విరాళం అందుకుంటున్న యూత్ సభ్యులు

ముథోల్: మండల కేంద్రంలో వినాయక ప్రతిమ ఏర్పాటుకు చైతన్యయూత్ మండలి సభ్యులకు మంగళవారం బీజేపీ నాయకులు తాటివార్ రమేశ్ రూ.50వేలను విరాళంగా అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రామారావుపాటిల్ గెలిస్తే వినాయక విగ్రహానికి రూ.50వేలు విరాళం అందిస్తానని మొక్కుకున్నట్లు రమేశ్ తెలిపారు. యూత్ అధ్యక్షుడు సాయియాదవ్, సభ్యులు వెంకటేశ్ గౌడ్, డాంగే గోపిపటేల్, మేకల సాయి, చందుసింగ్, సంజు, రాజు, సాయి ఉన్నారు.

వినతిపత్రం అందజేత

ముథోల్: మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఏఈ, ఏడీలకు మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్ వినతిపత్రం అందజేశారు. ముథోల్‌లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని.. నియంత్రికలను సకాలంలో సరిచేయకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. సరిపడ సిబ్బందిని నియమించాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్ మోహన్‌యాదవ్, బత్తిన్ సాయినాథ్, శివాజీ, రమేశ్ అరవింద్ ఉన్నారు.

మందులు పంపిణీ

కుంటాల: వ్యాధులు ప్రబలుతున్న వేళ తాజా ఆహారం, కాచిచల్లార్చిన నీటిని తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. మంగళవారం కుంటాలలో జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీఎస్ ప్రసాద్, ఏఎన్ఎం సుచరిత, అంగన్‌వాడీ టీచర్ రాణి, ఆశాకార్యకర్తలు విజయ, మమత, దేవకి ఉన్నారు.

అపరిశుభ్రతతో ముప్పు

ఖానాపూర్: అపరిశుభ్రతతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని.. ప్రజలకు పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో సునీత అన్నారు. మంగళవారం మండలంలోని సేవానాయక్ తండాలో చేపట్టిన ఫీవర్ సర్వేను పరిశీలించి మాట్లాడారు. అనారోగ్యానికి గురైతే వైద్యారోగ్యశాఖ సిబ్బంది వద్ద వివరాలు నమోదు చేసుకొని చికిత్స పొందాలన్నారు. ఎంపీవో రత్నాకర్‌రావు, తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. ప్రజలకు కష్టం

- రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంటలు



తానూరు: ఝరి(బి)లో లోలెవల్ వంతెన వద్ద నీటిని పరిశీలిస్తున్న పీఆర్ అధికారులు



ఓని గ్రామం నుంచి బాసర వెళ్లే మార్గంలో మునిగిన రోడ్డు వద్ద గ్రామస్తులు

బాసర: రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు బాసర మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే లోలెవల్ వంతెనలు, కొన్నిరోడ్లు నీట మునగడంతో రాకపోకలు స్తంభించాయి. ఓని, కీర్గుల్, కె.కౌఠ, సాలాపూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రం వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బాసర నుంచి ఓనీ గ్రామం వెళ్లే రోడ్డు నీట మునగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. బాసర వెళ్లేందుకు ముథోల్, అష్ట గ్రామం మీదుగా వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఝరి(బి) లోలెవల్ వంతెన పరిశీలన

తానూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఝరి(బి) లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుడటంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్ డీఈ కమలాకర్, ఏఈ థోఫిక్ మంగళవారం లోలెవల్ వంతెనను పరిశీలించారు. నిధులు మంజూరు చేసి వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని డీఈ తెలిపారు. వారి వెంట సిబ్బంది గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: భారీవర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పత్తి చేన్లతోపాటు మొక్కజొన్న, సోయా, వరి పంటల్లో వర్షపునీరు చేరింది. పీచర, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లోని పత్తి చేన్లలో లక్ష్మణచాంద, పొట్టపెల్లి, నర్సాపూర్, మునిపెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో మొక్కజొన్న, సోయా, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

లోకేశ్వరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మండలకేంద్రంలో పెద్దచెరువు పూర్తిగా నిండి అలుగు పారుతోంది. పత్తి, వరి, సోయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో నీట మునిగిన పంట



లోకేశ్వరంలో నీట మునిగిన పంట

ప్రాణాలు కాపాడిన ఎంపీడీవో

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలో గుండాల లక్ష్మి కుటుంబం శిథిలావస్థకు చేరిన ఇంట్లో ఉంటోంది. భారీవర్షాల నేపథ్యంలో సోమవారం ఎంపీడీవో రాధ గ్రామంలో పర్యటించి లక్ష్మి ఇంటిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఇంట్లో ఉండటం ప్రమాదమని.. పంచాయతీ కార్యదర్శి చందుకు చెప్పి వెంటనే వారిని సురక్షిత ప్రదేశానికి తరలించారు. బాలింత అయిన లక్ష్మి, తన నెలరోజుల పసికందుతో కలిసి వెళ్లిన కొన్ని గంటలకే ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఎంపీడీవో నిర్ణయంతోనే వారి ప్రాణాలు దక్కాయని గ్రామస్తులు పేర్కొన్నారు.



మామడ: గుట్ట నుంచి ఇళ్లలోకి వరద రాకుండా తవ్విస్తున్న అధికారులు

మామడ: మండలంలోని తోటిగూడ గ్రామంలో గుట్ట మీది నుంచి వర్షపునీరు ఇళ్లలోకి రాకుండా మంగళవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి పొక్లెయిన్‌తో గుట్ట నుంచి నీరు ఇళ్లలోకి రాకుండా కాల్వ తీయించారు.

మానవత్వం చాటుతున్న మహనీయులు

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన వడ్యాల భూమన్న ఇల్లు వర్షాలకు కూలిపోయింది. బాధిత కుటుంబానికి లోకేశ్వరం ఐక్యత సేవా బృందం సభ్యులు అండగా నిలిచారు. నెలరోజులకు సరిపడ నిత్యావసర సరుకులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాల గంగాధర్, జగదీశ్ ఉన్నారు.

మా అమ్మ–నాన్న ఫౌండేషన్ చేయూత

మా అమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ఆంజనేయులు ఆధ్వర్యంలో భూమన్న కుటుంబానికి రూ.5వేల విలువైన బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మహేందర్‌రెడ్డి, శంకర్, శ్రీరాములు, శ్రీకాంత్, పోశెట్టి, గంగన్న పాల్గొన్నారు.

కుంటాల: కుంటాలకు చెందిన కుంటల్‌వార్ ప్రకాశ్ ఇల్లు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. కాగా మంగళవారం మాజీ సర్పంచ్ సమతా వెంకటేశ్ బాధిత కుటుంబానికి 15 రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. శ్రీరాంవార్ గజేందర్, గోడపురం గజేందర్ పాల్గొన్నారు.



హవర్గలో సరుకులు అందిస్తున్న సభ్యులు

భైంసారూరల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పునరావాస ప్రాంతమైన నర్సాపూర్(జి) మండలంలోని మోతక్‌పల్లి గ్రామ వరద బాధితులకు భైంసా మండలం పేండ్‌పెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆశ్రయం కల్పించారు. మంగళవారం 25 మంది వరద బాధితులకు పేండ్‌పెల్లి పాఠశాల హెచ్ఎం అమృతం రూ.ఐదువేలు వెచ్చించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాజొద్దీన్, నాయకులు రాజారెడ్డి, మహేశ్, గంగారెడ్డి, విఠల్, రమణాగౌడ్, బంటుపటేల్, రాజు, మహిపాల్ తదితరులు ఉన్నారు.



కుంటాల : సరుకులు అందిస్తున్న వెంకటేశ్



భైంసారూరల్: పాఠశాలలో అన్నదానం చేస్తున్న హెచ్ఎం అమృతం

కుభీర్ పంచాయతీకి తాళం

- పీహెచ్‌సీని చుట్టుముట్టిన వరద
- విఠలేశ్వరస్వామి ఆలయం వైపు నీటిని మళ్లించిన అధికారులు
- గర్భగుడిలోకి నీళ్లు వస్తున్నాయని ఆలయ కమిటీ ఆగ్రహం



గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు



ఆసుపత్రి ఆవరణ నుంచి వరద వెళ్లేలా ఆలయం వైపు జేసీబీతో కాల్వ తీయిస్తున్న అధికారులు

కుభీర్: వర్షాలకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిలిచిన వరదను తొలగించేందుకు అధికారులు విఠలేశ్వర ఆలయం వైపు కాల్వ తవ్వించడంతో గొడవ తలెత్తింది. వివరాల్లోకి వెళితే.. కుభీర్‌లోని ప్రధాన మురుగుకాల్వ వడ్డెర కాలనీ నుంచి ఆసుపత్రి, విఠలేశ్వర ఆలయం ముందు నుంచి శివారులోని వాగు వరకు ఉంది. ఈ మురుగుకాల్వపై అనుమతుల్లేకుండా కొందరు ఇష్టానుసారం రేకులషెడ్లు వేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వరద, మురుగునీరు కాల్వ గుండా వెళ్లకుండా మేదరికాలనీ ఇళ్లలోకి, పీహెచ్‌సీ ఆసుపత్రి ఆవరణలోకి చేరుతోంది. అక్రమ షెడ్లను తొలగించాలని 2018లో పంచాయతీ అధికారులు నోటీసులిస్తే 10 మంది షెడ్ల యజమానులు కూల్చవద్దని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. దీంతో ఏళ్లుగా సమస్య అలానే ఉంటోంది.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ఇటీవలి భారీ వర్షాలకు మేదరివాడ ఇళ్లలోకి, ఆసుపత్రి ఆవరణలోకి వరద చేరింది. దీంతో సమస్య మళ్లీ ఉన్నతాధికారుల వద్దకు చేరింది. వారి ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు అక్రమ షెడ్లు తొలగించాలని చూసినా షెడ్ల యజమానులు కోర్టు స్టే కాపీని చూపారు. మంగళవారం ఇద్దరు తమ అక్రమ షెడ్లను కూల్చివేసినా ఆసుపత్రిలోని వరద బయటకు వెళ్లలేదు. దీంతో ఎంపీడీవో మోహన్‌సింగ్, ఇతర పంచాయతీ అధికారులు మంగళవారం ఉదయం ఆవరణ నుంచి వరద వెళ్లేలా ఆసుపత్రి ప్రహరీకి పొక్లెయిన్‌తో రంధ్రం చేసి విఠలేశ్వర మందిరం వైపు నీటిని మళ్లించారు.

ఆలయంలోకి నీళ్లు వస్తున్నాయని..

పీహెచ్‌సీ నుంచి విఠలేశ్వరస్వామి మందిరం వైపు వరద వస్తుందని ఆలస్యంగా ఆలయ కమిటీ సభ్యులు అధికారులతో గొడవ దిగారు. గర్భగుడిలో మురికి నీళ్లు వస్తే ఎలా అని నిలదీశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, కొందరు గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వారు ప్రకటించారు. ఆసుపత్రిలోని వరద తొలగించాలని ఉన్నతాధికారులు చెప్పడంతోనే ఆలయం వైపు కాల్వ తీయించినట్లు ఎంపీడీవో మోహన్‌సింగ్ తెలిపారు.

ఘనంగా 'పొలాల' పండుగ



కొత్తమద్దిపడగలో మట్టి ఎడ్ల ప్రతిమలతో నేతలు



నర్సాపూర్(జి)లో ఆలయానికి వెళ్తున్న రైతులు

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ, మాసాయిపేట్ గ్రామాల్లో మంగళవారం పొలాల అమావాస్య వేడుకలు నిర్వహించారు. రెండోరోజు మట్టి ఎడ్ల ప్రతిమలతో వీధుల గుండా ర్యాలీ తీసి కాలువల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గే వెంకటేశ్, జడ కృష్ణయ్య, మార్కురి నవీన్ తదితరులున్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంతోపాటు చాక్‌పల్లి, కుస్లి, రాంపూర్ గ్రామాల్లో పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. రైతులు ఎడ్లను అలంకరించి హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన 14వ వార్డ్ మాజీ సభ్యులు సూరపు సాయికృష్ణ తల్లి గంగామణి ఇటీవల మరణించింది. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు. సత్యనారాయణగౌడ్, అర్జున్ ఠాకూర్, దత్తురాం, విజయ్ ఉన్నారు.

మగవారితో సమానంగా చూడాలి

ఖానాపూర్: ఆడపిల్లలను మగవారితో సమానంగా చూసినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో బేటీ బచావో బేటీ పఢావో పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, నాయకులు నాయిని సంతోష్, సిబ్బంది పద్మ, పార్వతి ఉన్నారు.

వడ్యాల్‌లో 'రూమ్ టు రీడ్'

లక్ష్మణచాంద: రూమ్ టు రీడ్‌లో భాగంగా మండలంలోని వడ్యాల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రీడ్ ఏ థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు విద్యార్థులకు కథల పుస్తకాలను చదివించారు. లేఖలు రాయించారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులు జ్ఞానవంతులుగా మారుతారని పేర్కొన్నారు. మండల కోఆర్డినేటర్ శ్రీ గోవర్ధన్‌నాయుడు, సీఆర్పీ సుధాకర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తీజ్ వేడుకలు

సారంగాపూర్: మండలంలోని కౌట్ల(బి) శాంతినగర్ కాలనీలో బంజారా సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. యువతులతో కలిసి గోధుమనారు బుట్టలను ఎత్తుకుని సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. గంగారెడ్డి, కొరిపెల్లి రాజు, సత్యనారాయణగౌడ్, సాహెబ్‌రావు, విజయ్, రాంశంకర్‌రెడ్డి, విలాస్, మోహన్, పోతన్న తదితరులు ఉన్నారు.

మామడ: మామడతండాలో మంగళవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ హన్మాగౌడ్, గంగారాం, గణేశ్ పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): మండలంలోని అంజనీతండాలో బంజారాలు తీజ్ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను పెళ్లికాని యువతులు గోధుమనారు బుట్టలను ఎత్తుకొని నృత్యాలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం స్థానిక చెరువుల్లో గోధుమనారు బుట్టలను నిమజ్జనం చేస్తారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మామడతండాలో పాల్గొన్న గ్రామస్తులు

అనాథ పిల్లలకు చేయూత

నర్సాపూర్ (జి): మండల కేంద్రానికి చెందిన గాయత్రి(14), సాయికిరణ్ (10), అఖిల్‌కుమార్ (9) తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన విషయం తెలిసిందే. వారికి నర్సాపూర్ (జి) ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ (ఈఆర్‌సీ) అండగా నిలిచింది. మంగళవారం పిల్లల భవిష్యత్తు అవసరాల కోసం రూ.27,500 నగదును అందజేశారు. పిల్లల చదువులకు సాయం చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఈఆర్‌సీ అధ్యక్షుడు చాట్ల భూమేశ్వర్, సభ్యులు ఎ.లింగయ్య, జె.దేవన్న , ఎ.విఠల్‌రెడ్డి, ఎం.శేఖర్, ఎ.నర్సయ్య, పి.గంగారాం, జి.రాజేశ్వర్‌రెడ్డి, ఎ.భాస్కర్ తదితరులు ఉన్నారు.



సాయం అందిస్తున్న ఈఆర్‌సీ సభ్యులు

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు



అందాకూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి రమ్య, తదితరులు

కుంటాల: భారీవర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలతోపాటు ఇళ్లు దెబ్బతిన్నాయి. సోమవారం రాత్రి అందాకూర్ గ్రామానికి చెందిన షరీఫాబేగం, కుంటాలకు చెందిన కుంటల్‌వార్ ప్రకాశ్ ఇళ్లు కూలిపోయాయి. పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, రమ్య పరిశీలించి వివరాలు సేకరించారు. మండలంలో 4సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పిడుగుపాటుకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కుంటాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిడుగుపాటుకు దగ్ధమైంది. స్టేషన్‌లోని మూడు ఫ్యాన్లు కాలిపోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏఈ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేసి మంగళవారం సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. హఫీజ్, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఖానాపూర్: గణేశుడి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. పట్టణంలోని గోదావరి తీరంలో నిమజ్జనానికి మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్వాహకులకు సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుందని ఎస్సై లింబాద్రి అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవాలు జరుపుకోవాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్ కోరారు. తహసీల్దార్ శివరాజ్, కమిషనర్ మనోహర్, దయానంద్, రమేశ్, సురేశ్, కిశోర్‌నాయక్, కలీల్, సంతోష్, అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

పెంబిలో సీఐ సమావేశం

పెంబి: వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మంగళవారం పెంబిలో మండలంలోని అన్ని గ్రామాల యువకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మండపాల నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు ఇవ్వాలన్నారు. నిమజ్జన సమయంలో యువత మద్యం సేవించవద్దన్నారు. దురాశతో యాప్‌లలో డబ్బులు పెట్టి మోసాల బారిన పడొద్దని పేర్కొన్నారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్సై శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేష్, పోలీస్ సిబ్బంది, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. డ్రెయినేజీలు నిర్మించరూ..



భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామంలో ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, **ఫోన్:** 83090 52136

జాబితా పరిశీలన

కుంటాల: మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఓటరు జాబితా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో ఎం.ఏ రహీం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.